

రంజాన్ వేళలు	ఇఫ్తార్ (ఆది)	సా.6.22
	సహరి (సోమ)	ఉ.4.48

ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈగా భారతి

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 16: కాకినాడ ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈగా ఎస్.భారతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె కలెక్టర్ కృతికాశుక్లా, జేసీ రామ్‌సుందర్ రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు.

మోగిన భేరీ!





ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అసెంబ్లీ ఎన్నికల గంట మోగింది. ఈ మేరకు ఎన్నికల సంఘం అధికారికంగా శనివారం మధ్యాహ్నం 3గంటలకు నగారా మోగించింది. ఇందులోభాగంగా అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెల్లడించింది.

- అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో జిల్లాలో ఎన్నికల సందడి
- వచ్చే నెల 18న ఎన్నికల నోటిఫికేషన్: నామినేషన్ల గడువు ఏప్రిల్ 25 వరకు..
- ఏప్రిల్ 28న నామినేషన్ల పరిశీలన; ఉపసంహరణ ఏప్రిల్ 29న
- అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ మే 13న: ఓట్ల లెక్కింపు జూన్ 4న
- జిల్లాలో శనివారం మధ్యాహ్నం నుంచి అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్
- ఎక్కడికక్కడ పాతుకుపోయిన వైసీపీ ఫ్లెక్సీలను ధైర్యంగా తొలగించిన అధికారులు
- ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం జగన్ ఫొటోలు, క్యాలెండర్లు తొలగింపు
- జిల్లాలో అన్నిస్థానాల్లో అభ్యర్థులను ప్రకటించిన వైసీపీ.. కూటమిలో ఒకటి పెండింగ్

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

వచ్చేనెల 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. దీని ప్రకారం నామినేషన్ల గడువు ఏప్రిల్ 25గా ప్రకటించింది. 28న నామినేషన్ల పరిశీలన ప్రక్రియ, తర్వాత 29న ఉపసంహరణ కొనసాగనుంది. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ మే 13న జరగనుంది. జూన్ 4న ఓట్ల లెక్కింపు తేదీగా ప్రకటించారు. దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో దాని ప్రభావంతో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ఈదఫా ఎక్కువ రోజులు కొనసాగనుంది. తద్వారా అభ్యర్థులకు ఖర్చు తడిసి మోపెడు కానుంది. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో జిల్లాలో శనివారం మధ్యాహ్నం నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లయింది. ఫలితంగా జిల్లావ్యాప్తంగా శనివారం సాయత్రం నుంచి ఎక్కడికక్కడ భారీగా అనధికారికంగా ఏళ్ల తరబడి కొనసాగుతున్న వైసీపీ ఫ్లెక్సీలను అధికారులు తొలగించారు. అనేక ప్రభుత్వ కార్యాలయాల్లో జగన్ చిత్రపటంతోపాటు క్యాలెండర్లను కూడా తొలగించారు.

వైసీపీలో ఏడూ ప్రకటన..

అధికార వైసీపీ జిల్లాలో అన్ని స్థానాల్లో అభ్యర్థులను అధికారికంగా ప్రకటించింది. ఏడు సీట్లలో అభ్యర్థుల పేర్లు వెల్లడించింది. ఇందులో ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గంపేట స్థానాల్లో గతంలో సిట్టింగ్ ఎమ్మెల్యేలను తొలగించి వారి స్థానాల్లో మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, ఎంపీ గీత, తోట నరసింహం పేర్లను ఖాయం చేసింది. కాకినాడ సిటీ, తుని, కాకినాడ రూరల్ స్థానాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు ద్వారంపూడి, దాడిశెట్టిరాజా, కన్నబాబులను కొనసాగించింది. పెద్దాపురం నుంచి నియోజకవర్గ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు పేరును ప్రకటించింది. ఒకరకంగా ఈ పేర్లన్నీ ఎప్పటినుంచో చెబుతున్నవే. పెద్దగా మార్పులేవీ లేకుండానే వైసీపీ తన జాబితా వెల్లడించింది.



కాకినాడలో ఫ్లెక్సీలను తొలగిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

ఉమ్మడి అభ్యర్థులు ఒక్కటి తప్ప..

ఇటు టీడీపీ, జనసేన పార్టీలు జిల్లాలో ఇప్పటికే తమ అభ్యర్థులను ప్రకటించాయి. కాకినాడ సిటీ సీటుపై మాత్రం ఇంకా సస్పెన్స్ కొనసాగుతోంది. మొత్తం ఏడు సీట్లలో పిఠాపురంనుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్, కాకినాడరూరల్ నుంచి పంతనం నానాజీ జనసేన తరఫున బరిలోకి దిగుతున్నారు. అటు ఎంపీ అభ్యర్థిగా వైసీపీనుంచి చలమశెట్టి సునీల్ పేరును ప్రకటించారు. కూటమిలో జనసేనకు ఎంపీ సీటు వెళ్లడంతో ఆ పార్టీ అభ్యర్థి ఎవరనేది త్వరలో తేలనుంది. ఇరుపార్టీల అభ్యర్థులపై స్పష్టత రావడం, అటు షెడ్యూల్ విడుదల కావడంతో జిల్లాలో అసలు సిసలు రాజకీయ పోరు మొదలుకానుంది.

అమలులోకి ఎన్నికల ప్రవర్తన నియమావళి

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 16: జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం చేశామని, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. కలెక్టరేట్ స్పందన హాలులో శనివారం విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గంతోపాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. దీనిలో తుని, ప్రత్తిపాడు, పిఠాపురం, కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాలున్నాయన్నారు. కాకినాడ జిల్లాలో 16,11,021మంది ఓటర్లుండగా దీనిలో పురుషులు 7,93,455మంది కాగా, మహిళలు 8,17,393మంది ఉన్నారని తెలిపారు. దీనిలో కొత్తగా ఓటుహక్కు పొందిన వారు 29,419 కాగా, యువఓటర్లు 2లక్షల22వేలమంది ఉన్నారని చెప్పారు. నోటిఫికేషన్ విడుదలైన తర్వాత ఓటర్ల మార్పులు, చేర్పులు ఉండవన్నారు.

24 గంటల్లో పోస్టర్లు తొలగించాలి

ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న రాజకీయ నాయకుల పోస్టర్లు, కటౌట్లు, హోర్డింగులు 24 గంటల్లో తొలగించాలన్నారు. మరో 48 గంటల్లో పబ్లిక్ ఆస్తులు అనగా బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ప్రభుత్వ స్తంభాలు వంటి వాటిపై ఉన్న పోస్టర్లను తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు.

ప్రలోభాలపై ఫ్లైయింగ్ స్క్వాడ్స్ నిఘా

ఎన్నికల్లో నగదు, మద్యం, చీరలు వంటి పంపిణీనీ అడ్డుకునేందుకు జిల్లావ్యాప్తంగా 21 ఫ్లైయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వాడ్స్‌లో ఒక తహసీల్దార్‌తోపాటు పోలీస్ అధికారి ఉంటారని చెప్పారు. ఎన్నికల కాల్ సెంటర్‌కు వచ్చే ఫిర్యాదుల ఆధారంగా కూడా వీరు తనిఖీలు చేస్తారన్నారు. మండలానికి ఒక్కొక్క ఫ్లైయింగ్ స్క్వాడ్ చొప్పున నియమించామన్నారు. ఓటర్లు ఫిర్యాదు చేయడానికి వీలుగా సీవిజిల్, 1950 కాల్ సెంటర్‌కు ఏర్పాటు చేశామన్నారు.

ఎన్నికల విధులకు దూరంగా వలంటీర్లు

ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం గ్రామ, వార్డు వలంటీర్లను, కాంట్రాక్ట్ ఉద్యోగులను ఎన్నికల విధులకు దూరంగా ఉంచుతామని కలెక్టర్ తెలిపారు. ఎక్కడైనా ఎన్నికల విధుల్లో పాల్గొంటే తమకు ఫిర్యాదు చేయాలన్నారు.

50శాతం కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్

జిల్లాలో 1640 పోలింగ్ కేంద్రాలుండగా దీనిలో 50శాతం కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ చెప్పారు. మిగిలిన కేంద్రాల్లో వీడియోగ్రాఫర్లు పోలింగ్ కవరేజ్ చేస్తారన్నారు.

దరఖాస్తులు పెండింగ్‌లో..

ఓటుకోసం దరఖాస్తు చేసిన దరఖాస్తుల్లో ఆరు వేలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని ఆర్వోలు పరిశీలించాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు.

ఫిర్యాదుకు కంట్రోల్ రూమ్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 16: ఎన్నికల్లో జరిగే అక్రమాలపై ఫిర్యాదు చేయడానికి జిల్లాస్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. 0884-2346599, 0884-2346399 నెంబర్లకు ఫిర్యాదు చేయాలన్నారు. సీ విజిల్ యాప్, 1950 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కూడా ఫిర్యాదు చేయాలన్నారు. జిల్లాలో లక్ష ఫొటో ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. మరో 15రోజుల్లో పోస్టు ద్వారా సంబంధిత ఓటర్లకు అందజేస్తామన్నారు. ఫొటో గుర్తింపు కార్డుల కోసం ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

- జిల్లాలో 16,11,021 మంది ఓటర్లు
- 50శాతం కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్
- మిగిలిన పోలింగ్ కేంద్రాల్లో వీడియో గ్రాఫర్లతో నిఘా
- ఎన్నికల విధులకు దూరంగా వలంటీర్లు
- జిల్లా ఎన్నికల అధికారి కృతికాశుక్లా

నామినేషన్ల వరకూ ఓటర్ల చేర్పునకు అవకాశం

- జేసీ రామసుందరరెడ్డి



పిఠాపురం, మార్చి 16: అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల నామినేషన్ల చివరి రోజు వరకూ నూతనంగా ఓటర్లు చేర్పునకు అవకాశం ఉందని జేసీ, పిఠాపురం నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.రామసుందరరెడ్డి తెలిపారు. పిఠాపురంలో శుక్రవారం ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదలతో నియమావళి అమలులోకి వచ్చిందన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలపై ఉన్న రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో పోటీ చేసే ప్రజాప్రతినిధుల ఫొటోలను 24గంటల్లోగా తొలగిస్తామని చెప్పారు. ప్రైవేటు, పబ్లిక్ స్థలాల్లో ఉన్న హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు, ఇతర ప్రచార పోస్టర్లు 48గంటల్లోగా తొలగించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఎక్కడైన హోర్డింగ్‌లు పెట్టాలనుకుంటే పట్టణ ప్రాంతాల్లో మునిసిపల్ కమిషనరు, గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవోల అనుమతి తీసుకోవాలని సూచించారు. పదోతరగతి పరీక్షలు 18 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో వాటికి దూరంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించుకోవాలని సూచించారు. ఉదయం 6 నుంచి రాత్రి 10గంటల వరకూ మాత్రమే ప్రచారానికి అనుమతి ఉందన్నారు. నియోజకవర్గంలో 84 పోలింగ్ కేంద్రాలను క్రిటికల్‌గా గుర్తించినట్లు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఇప్పటినుంచి సీఆర్‌పీఎఫ్ బలగాలతో బందోబస్తు నిర్వహిస్తామని చెప్పారు.

ఫ్యాన్‌కు పాత రెక్కలే..

ప్రజలు వ్యతిరేకించినా.. మళ్లీ సిట్టింగ్‌లకే ఛాన్స్



చలమలశెట్టి సునీల్ | వంగా గీతా విశ్వనాథ్ | వరుపుల సుబ్బారావు | తోట నరసింహం | కురసాల కన్నబాబు | దవులూరి దొరబాబు | దాడిశెట్టి రాజా

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని అసెంబ్లీ, ఎంపీ స్థానాల్లో అధికార వైసీపీ ఎట్టకేలకు అభ్యర్థులను ప్రకటించింది. ఓటమి భయంతో ఇన్నాళ్లు అనేక స్థానాల్లో ఎవరు బరిలో ఉంటారో తేల్చలేక సతమతమైన ఫ్యాన్ పార్టీ పలు స్థానాల్లో రాజీపడింది. అక్కడ అభ్యర్థులను మార్చాలని భావించినా ఎక్కడ మళ్లీ కొత్త తలనొప్పులు వస్తాయోనన్న భయంతో కొంత తగ్గింది. చేసేదిలేక అనేక స్థానాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలకే దాదాపు మొగ్గు చూపింది. ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో 19 అసెంబ్లీ, పశ్చిమ నుంచి కొత్త తూర్పుగోదావరి జిల్లాలో కలిసిన మూడు స్థానాలు వెరసి మొత్తం 22 స్థానాలకు ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గంపేట, పి.గన్నవరం స్థానాల్లో ప్రస్తుత ఎమ్మెల్యేలను తప్పించి వారి స్థానాల్లో కొత్త అభ్యర్థులను బరిలో నిలబెట్టింది. ముగ్గురు మంత్రుల్లో ఒకరిని రామచంద్రపురం నుంచి తప్పించి రాజమహేంద్రవరం రూరల్ నుంచి పోటీలోకి దింపింది. మిగిలిన ఇద్దరు మంత్రులు విశ్వరూప్, దాడిశెట్టి రాజా యథాతథంగా వారి స్థానాల్లోనే బరిలో ఉన్నారు. మంత్రి విశ్వరూప్‌ను మార్చాలని ప్రయత్నించినా ప్రత్యామ్నాయం లేక తిరిగి ఆయన్నే కొనసాగించింది. రాజోలు స్థానంపై మరోసారి పునరాలోచించాలని ఎమ్మెల్యే రాపాక తిరగబడ్డా వైసీపీ పట్టించుకోలేదు. కాకినాడ జిల్లాలో వైసీపీ ఒక్క బీసీకి కూడా అసెంబ్లీ టిక్కెట్ ఇవ్వకుండా మొత్తం ఓసీలతో నింపేయడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. రాజమహేంద్రవరం పార్లమెంట్‌లో చెరో రెండు సీట్లు బీసీ, ఎస్సీలకు, మూడు సీట్లు ఓసీలకు కట్టబెట్టింది. అమలాపురం పార్లమెంట్ పరిధిలో మూడు సీట్లు ఎస్సీ, చెరో రెండు బీసీలు, ఓసీలకు కట్టబెట్టింది. వెరసి రంపచోడవరంతోపాటు మూడు పార్లమెంట్ స్థానాల పరిధిలో మొత్తం 21 సీట్లకు 12 స్థానాల్లో ఓసీలకు పెద్దపీట వేయగా 10 మంది అభ్యర్థులు కాపు సామాజిక వర్గం నుంచి ఉన్నారు. మూడు ఎంపీ స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించిన వైసీపీ అమలాపురం సిట్టింగ్ ఎంపీ అనురాధకు మొండిచేయి చూపింది.

బీసీలకు అన్యాయమే...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 22 స్థానాల్లో అధికార వైసీపీ మెజార్టీ సీట్లు ఓసీలకే కట్టబెట్టింది. మాట్లాడితే నా ఎస్సీలు, నా బీసీలు అంటూ మాటలు వల్లె వేసే వైసీపీ అధ్యక్షుడు జగన్ సీట్ల కేటాయింపులో మాత్రం సామాజిక సమతూకం పెద్దగా పాటించకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఎన్నికల్లో అయినా బీసీలకు ప్రాతినిధ్యం పెంచాలని డిమాండ్లు వచ్చినా వైసీపీ పెద్దగా పట్టించుకోలేదు. మొత్తం 22 సీట్లకు 12 స్థానాల్లో ఓసీలకు పెద్దపీట వేశారు. సగానికిపైనే సీట్లు కట్టబెట్టారు. ఓసీలకు ఇచ్చిన 12 సీట్లలో పది మంది అభ్యర్థులు కాపు సామాజికవర్గం నుంచే ఉన్నారు. ముఖ్యంగా కాకినాడ పార్లమెంట్ స్థానం పరిధిలో మొత్తం ఏడు అసెంబ్లీ సీట్లు ఉండగా అన్నీ ఓసీలకే కట్టబెట్టారు. ఇందులో ఆరు సీట్లు కాపు సామాజికవర్గం నుంచి ఒక సీటు రెడ్డి సామాజికవర్గం నుంచి ఉన్నాయి. వాస్తవానికి కాకినాడ పార్లమెంట్ పరిధిలో ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లో మూడు సీట్లు టీడీపీ బీసీలకు ఇస్తోంది. 2019 ఎన్నికల్లో తుని, కాకినాడ సిటీ, కాకినాడ రూరల్ స్థానాల్లో బీసీ అభ్యర్థులను టీడీపీ నిలబెట్టింది.కానీ వైసీపీ ఒక్కరికీ చోటు కల్పించలేదు. ఈ సారి అదే విధానం పాటించి బీసీలకు అన్యాయం చేసింది. రాజమహేంద్రవరం పార్లమెంట్ స్థానంలో చెరో రెండు సీట్లు బీసీ, ఎస్సీలకు, మూడు సీట్లు ఓసీలకు కట్టబెట్టింది. అమలాపురం పార్లమెంట్ పరిధిలో మూడు సీట్లు ఎస్సీ, చెరో రెండు బీసీలు, ఓసీలకు కట్టబెట్టింది. తద్వారా మొత్తం 22 సీట్లలో 12 మంది ఓసీలు, అయిదు స్థానాలు ఎస్సీ నాలుగు స్థానాల్లో మాత్రమే బీసీలకు ప్రాతినిధ్యం కల్పించింది.

వెంటాడుతున్న ఓటమి భయం..

వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా వ్యతిరేక, నియంతృత్వ విధానాలతో పాలన సాగించింది. ఒక పక్క పన్నుల వాత.. మరోపక్క నవరత్నాల పేరుతో లబ్ధిదారుల్లో కోత జనాలను అడుగడుగునా మోసం చేసింది. దీనికితోడు ఎక్కడికక్కడ అధికారపార్టీ నేతల విచ్చలవిడి అవినీతి, బెదిరింపులు, దందాలు, దౌర్జన్యాలకు అంతులేకుండా పోయింది. ఉద్యోగుల విషయంలోనూ వారిని నానా వేధింపులకు గురిచేశారు. ఈ నేపథ్యంలో వైసీపై పాలనపై అన్ని వర్గాల ప్రజల్లో విసుగొచ్చేసింది. ఎన్నికలు దగ్గరపడ్డ తరుణంలో పార్టీ ఎమ్మెల్యేలు భారీగా ఓడిపోతారనే భయం అధికార పార్టీని వెన్నాడింది. ఎక్కడికక్కడ నియోజకవర్గాల్లో ఐప్యాక్ సర్వేల్లో వైసీపీపై తీవ్ర వ్యతిరేకత ఉన్నట్టు తేలింది. దీంతో గడచిన నాలుగు నెలలుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలువురు ఎమ్మెల్యేలను సర్వే పేరుతో పక్కన పెట్టడం మొదలుపెట్టింది. వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇస్తే ఓడిపోతారంటూ వారిని తప్పించింది. అందులో భాగంగా కాకినాడ పార్లమెంట్ పరిధిలో ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గంపేట, అమలాపురం పార్లమెంట్ పరిధిలో పి.గన్నవరం స్థానాల్లో ఎమ్మెల్యేల టిక్కెట్లు చింపేసింది. వారి స్థానాల్లో కొత్త ఇన్‌చార్జులను నియమించింది. అయితే వీరిపైనా వ్యతిరేకత పెద్దగా తగ్గలేదని తేలడంతో తలపట్టుకుంది. అమలాపురంలో మంత్రి విశ్వరూప్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తంకావడంతో ఆయన్ను తప్పించాలనుకుంది. విశ్వరూప్, ఆయన తనయుడిని తాడేపల్లికి పిలిపించుకుని పార్టీ పెద్దలు మాట్లాడారు. తనకు సీటు ఖాయమైపోయిందని విశ్వరూప్ తనయుడు ప్రచారం చేసుకోవడంతో నియోజకవర్గంలో విబేధాలు మొదలయ్యాయి. తీరా ఇవి ఎక్కడి వరకు పోతాయో తెలియక చేసేదిలేక మళ్లీ విశ్వరూప్‌నే కొనసాగించింది. రామచంద్రపురం సీటు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి వేణుకు వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని సర్వేలో తేలింది. అదే సమయంలో టిక్కెట్ తమకు ఇవ్వాలంటూ ఎంపీ బోస్ పట్టుబట్టారు. లేదంటే పార్టీని వీడిపోతానని సంకేతాలు పంపారు. మంత్రి వేణు అవినీతిపై జగన్‌కు బోస్ ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో వేణును రాజమహేంద్రవరం రూరల్ సీటుకు పంపేశారు. రాజమహేంద్రవరం ఎంపీ భరత్‌కు ఓటమి తప్పదని సర్వేలో తేలింది. దీంతో ఆయన్ను రాజమహేంద్రవరం సిటీ స్థానానికి జగన్ బదిలీ చేశారు. అటు కొవ్వూరు ఎమ్మెల్యే వనితను గోపాలపురం, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకటరావును కొవ్వూరుకు సీట్లు మార్చి వ్యతిరేకత తప్పించుకునేందుకు వైసీపీ ప్రయత్నించింది. ఇటు కొత్తపేట, కాకినాడ సిటీ, పెద్దాపురం, జగ్గంపేట, ముమ్మిడివరం స్థానాల్లో అభ్యర్థుల్లో మార్చాలని భావించింది. కానీ అక్కడ పోటీకి దీటైన అభ్యర్థులు లేకపోవడం, మరికొందరు ఎమ్మెల్యేలైతే తమకు టిక్కెట్ నిరాకరించినా, వేరే స్థానానికి మార్చినా పార్టీని వీడిపోతామనే హెచ్చరికలు పంపారు. ఈ నేపథ్యంలో చేసేది లేక వారిని అయిష్టంగా కొనసాగిస్తూ శనివారం జాబితా వెల్లడించింది. ఇదిలా ఉంటే రాజోలు ఎమ్మెల్యే రాపాక తనకు ఈసారి వైసీపీ నుంచి సీటు ఖాయం అని ఇంత కాలం ధీమాగా ఉన్నారు. తీరా టీడీపీ నుంచి టికెట్ ఆశించిన మాజీ మంత్రి గొల్లపల్లి అనూహ్యంగా అక్కడ టిక్కెట్ దొరక్క వైసీపీలో చేరిపోయారు. ఫలితంగా ఈయనకు వైసీపీ రాజోలు టిక్కెట్ ఖరారు చేసింది. దీంతో రాపాక భగ్గుమన్నారు. తనను రాజోలు నుంచి తప్పించి అమలా పురం ఎంపీ అభ్యర్థిగా పంపడంపై గుర్రుగా ఉన్నారు. పార్టీపై తీవ్ర వ్యతిరేకత ఉన్న నేపథ్యంలో తనను ఎంపీ అభ్యర్థిగా పంపి వైసీపీ దగా చేసిందని.. అఖరి నిమిషంలోనైనా తనను రాజోలు పంపాలని కోరినా పార్టీ పట్టించుకోకపోవడంతో కారాలు మిరియాలు నూరుతున్నారు. రంపచోడవరం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ధనలక్ష్మిని తిరిగి కొనసాగించారు. మరోపక్క కాకినాడ ఎంపీగా చలమశెట్టి సునీల్, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థిగా గూడూరు శ్రీనివాస్‌ను ప్రకటించారు. అయితే మొత్తం అసెంబ్లీ, ఎంపీ స్థానాలకు వైసీపీ అభ్యర్థులందరినీ ఖరారు చేసినా అనేక మంది నేతల్లో అసంతృప్తి పెల్లుబుకుతోంది. సిట్టింగ్ ఎమ్మెల్యేల పరిస్థితి ఇంత దారుణంగా ఉండగా, సీటు బదిలీపై వచ్చినవారు సొంతపార్టీ కుంపట్లతో తలపట్టుకుంటున్నారు.

- ఉమ్మడి జిల్లాలో 22 సీట్లు ప్రకటన
- నాలుగు స్థానాల్లో సిట్టింగ్‌లు ఔట్
- మిగిలిన సీట్లలో సిట్టింగ్‌లకే ఛాన్స్
- ముగ్గురు మంత్రుల్లో ఒకరి స్థానం మార్పు
- 12 స్థానాల్లో ఓసీలను నిలబెట్టిన వైసీపీ
- ఎస్సీలకు 5, బీసీలకు 4 స్థానాలే
- కాకినాడ పార్లమెంట్‌లో బీసీలకు నో ఛాన్స్
- రాజోలు సీటుపై రాపాక గోడు వినని వైసీపీ
- ఎంపీగా అయిష్టంగానే బరిలోకి
- ఆలస్యంగా వచ్చిన గొల్లపల్లికి టిక్కెట్
- రాపాకకు చెక్ పెట్టిన అధిష్ఠానం
- అమలాపురం ఎంపీకి అవమానం
- ఎక్కడా టిక్కెట్ కేటాయించని వైసీపీ

వైసీపీ వర్సెస్ టీడీపీ

ఒకపక్క వైసీపీ వెల్లడించిన ఎంపీ,ఎమ్మెల్యే అభ్యర్థుల్లో మెజార్టీ స్థానాల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నా వారిని మార్చలేక అధిష్ఠానం చతికిలబడింది. దీంతో ఇందులో ఎక్కువ స్థానాల్లో ఓటమి తప్పదనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. మరోపక్క టీడీపీ కూటమి మాత్రం గెలుపు గుర్రాలే లక్ష్యంగా అభ్యర్థుల ఎంపికను దాదాపు పూర్తిచేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 19 సీట్లలో ఒక్క కాకినాడ సిటీ, అమలాపురం స్థానాల్లో మాత్రమే అభ్యర్థుల ప్రకటన పెండింగ్‌లో ఉంది. ఇప్పటివరకు ప్రకటించిన స్థానాల్లో సమర్థవంతమైన అభ్యర్థులతోపాటు సామాజిక సమీకరణాలు పక్కాగా పాటించింది. బీసీలు, ఎస్సీలు, ఓసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పిస్తూ అన్ని వర్గాలను ఆకట్టుకుంది. ఒకపక్క వైసీపీ, మరోపక్క టీడీపీ కూటమి సీట్లపై తొంభై శాతం స్పష్టత వచ్చేసిన నేపథ్యంలో రేపటి నుంచి జిల్లాలో ఇరుపార్టీల అభ్యర్థులు నువ్వానేనా అన్నట్లు తలపడనున్నారు. ఇక అధికార ప్రతిపక్షాల మధ్య అసలు సిసలు రాజకీయ పోరు ఆరంభం కానుంది.కాగా టీడీపీ కూటమి త్వరలో మూడు పార్లమెంట్ స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించనున్నాయి.

సమసిన వివాదం

- చంద్రబాబును కలిసిన పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ
- ఎమ్మెల్సీ, క్షత్రియ కోటాలో ప్రమోషన్ ఇస్తామని హామీ
- పవన్‌ను అత్యధిక మెజార్టీ గెలిపిస్తామని వర్మ ప్రకటన



మంగళగిరిలో మాట్లాడుతున్న టీడీపీ అధినేత చంద్రబాబు, పక్కనే ఎస్వీఎస్ఎన్ వర్మ

పిఠాపురం, మార్చి 16: పిఠాపురంలో ఏర్పడిన పొత్తు వివాదం సమసిపోయింది. చంద్రబాబును కలిసిన వర్మకు భరోసా లభించింది. ఎమ్మెల్సీతోపాటు క్షత్రియ కోటాలో ప్రమోషన్ కల్పించి(మంత్రి పదవి) మంచి భవిష్యత్తును ఇస్తానని ప్రకటించారు. పొత్తు ధర్మాన్ని గౌరవించాలన్న బాబు సూచనతో పవన్‌ను అత్యధిక మెజార్టీతో నెగ్గిస్తానని వర్మ ప్రకటించారు.

టీడీపీ,జనసేన పొత్తులో భాగంగా పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించడం, దీనిపై టీడీపీ శ్రేణులు ఆందోళనకు దిగి టీడీపీ కరపత్రాలు, జెండాలు దహనం చేశారు. ఈపరిణామాలతో వర్మను తన వద్దకు రావాలని టీడీపీ అధినేత చంద్రబాబు ఫోన్ చేశారు. దీంతో పార్టీ నాయకులతో కలిసి ఆయన వెళ్లి శనివారం కలిశారు. వారి మనోభావాలను చంద్రబాబు ముందుంచారు. పొత్తులో భాగంగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ భీమవరంనుంచి పోటీ చేస్తారని భావించానని, ఆయన పిఠాపురంనుంచి పోటీ చేస్తానని చెప్పడంతో అంగీకరించామని తెలిపారు. 2014 ఎన్నికల్లో పోటీచేయకుండా మనకు మద్దతు ఇచ్చిన వ్యక్తి పవన్‌కల్యాణ్ అన్నారు. అటువంటి వ్యక్తి ఈరోజు సైకో జగన్‌ను తరిమికొట్టేందుకు మనతో కలిసి పొత్తు పెట్టుకున్నారని తెలిపారు. వర్మ పోటీచేస్తే ఎలా కష్టపడతారో అంతకు రెట్టింపు కష్టపడి పనిచేసి పవన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సూచించారు. అధికారంలోకి రాగానే వర్మకు మొదటి విడతలోనే ఎమ్మెల్సీ ఇస్తామని, క్షత్రియ కోటాలో ప్రమోషన్ కల్పించి గౌరవిస్తామని ప్రకటించారు.

పవన్‌ను గెలిపిస్తాం.. వర్మ

చంద్రబాబు నిర్ణయానికి అనుగుణంగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కోసం కష్టించి పనిచేస్తానని మాజీ ఎమ్మెల్యే వర్మ తెలిపారు. పవన్ పిలిస్తే వెళ్లి మాట్లాడతానని చెప్పారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు సహా మా అందరి భవిష్యత్తుకు చంద్రబాబు భరోసా ఇచ్చారని, నియోజకవర్గ అభివృద్ధితోపాటు ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ పనులు చేపట్టడం, రూ.1800కోట్లతో నిర్మించిన పురుషోత్తపట్టణం ఎత్తిపోతల పథకం పునరుద్ధరణకు హామీ ఇచ్చారని వివరించారు. పొత్తు ధర్మాన్ని పాటిస్తామని చెప్పారు. చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా నడుచుకుంటానని చెప్పారు.

రేపటి నుంచి పది పరీక్షలు

- జిల్లావ్యాప్తంగా హాజరుకానున్న 32,262మంది విద్యార్థులు

కాకినాడ రూరల్, మార్చి 16: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ఈనెల 30 వరకూ జరుగుతాయని డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. జిల్లాలో మొత్తం 32,262మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని, 137 పరీక్షాకేంద్రాలను జిల్లాలో ఏర్పాటు చేశామని తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 27856మంది, రీఅప్పియర్ విద్యార్థులు 4,374మంది, ఓఎస్ఎస్‌సీలో రెగ్యులర్ 25, రీఅప్పియర్ విద్యార్థులు ఏడుగురు ఉన్నారని తెలిపారు. పరీక్షలు ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకూ జరుగుతాయన్నారు. ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలు 18నుంచి 27 వరకూ జరుగుతాయని సార్వత్రిక విద్య జిల్లా సమన్వయకర్త సాయి తెలిపారు.

లక్ష్మీనరసింహుని దివ్య కల్యాణానికి చురుగ్గా ఏర్పాట్లు

కోరుకొండ, మార్చి16: కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు ఈనెల 19వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో అన్నవరం దేవస్థానం జాయింట్ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఆధ్వర్యంలో అధికారులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామి వారి దేవస్థానం ముందు ప్రత్యేక విద్యుత్ దీపాలు ఏర్పాటు, పందిళ్ల నిర్మాణం, ఆలయానికి రంగులు వేయడం, కొండపైన, కొండదిగువున అన్ని నరసింహస్వామి ఆలయాలతో పాటు అన్ని ఉప ఆలయాలకు, దేవతామూర్తులకు, గోపురాలకు రంగులు వేస్తున్నారు. 650 మెట్లకు సున్నాలు వేస్తున్నారు. కొండపైన, మెట్ల మార్గం, కొండ చుట్టూ దేవస్థానం పరిసరాల్లో విద్యుత్ దీపాలంకరణలు చేస్తున్నారు. స్వామి వారి ఉత్సవమూర్తులను అలంకరిస్తున్నారు. స్వామివారి కల్యాణ మహోత్సవాలు సందర్భంగా ప్రతిరోజు రాత్రి స్వామివారు రోజుకో వాహనంలో గ్రామోత్సవం చేస్తారు. ఇందుకుగాను గజ, అశ్వ, ఆంజనేయ, శేష, గరుడ వాహనాలను సిద్ధం చేస్తున్నారు. కోరుకొండ తీర్థం పేరుతో జరిగే శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాల్లో అత్యంత ప్రాముఖ్యం కలది స్వామి వారి రథోత్సవం. ఈ సందర్భంలో స్వామి వారి అతి పురాతన పెద్ద రథాన్ని రథశాల నుంచి బయటకు తీసి మరమ్మత్తులు చేస్తున్నారు. రథానికి అమర్చే గుర్రాల బొమ్మలను సిద్ధం చేస్తున్నారు. రాత్రి పగలు సిబ్బంది స్వామి వారి కల్యాణ మహోత్సవ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అదే విధంగా ఆలయ అనువంశిక ధర్మకర్త, దేవస్థానం చైర్మన్ పరాసరరంగరాజ భట్టర్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. పరిసర గ్రామాల్లో వాల్ పోస్టర్లు అతికించే కార్యక్రమం జరుగుతోంది. రథోత్సవం సందర్భంగా కోరుకొండకు సుమారు లక్ష మంది భక్తులు వస్తారన్న అంచనాలతో అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రథం తిరిగే మార్గంలో రోడ్లు, డ్రైన్లు విశాలంగా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం కొండపైన, కొండ దిగువున స్వామి వారిని దర్శించుకునేందుకు ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. దేవుని కోనేటి వద్ద స్నానాలు చేసే భక్తులు కోసం తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాట్లు చేస్తున్నారు. మహిళలకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నారు. కొండపైన దీపాలు వెలిగించే భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అదే విధంగా స్థానిక రంగరాజస్వామి ఆలయం వద్ద కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, ఎండోమెంట్, ఎలక్ట్రికల్, ఆర్‌డబ్ల్యుఎస్, అధికారుల సమన్వయంతో పనిచేయాలని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కోరారు.


సిద్ధమవుతున్న రథం


అలంకరణ ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన

దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

అన్నవరం, మార్చి 16: హిందూ దేవాలయాలలో భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. జాతీయ రహదారిపై విజయవాడ వైపు వెళ్లే భక్తుల కోసం నమూనాలయం వద్ద నూతన ప్రసాదం కౌంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఇక్కడ భక్తులు సేదతీరేందుకు ప్రత్యేక వాతావరణం కల్పిస్తున్నామని దీనికి సుమారు రూ.4 కోట్లు వ్యయమవుతుందని అన్నారు. అనంతరం సత్యదేవుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసాదం ప్యాకెట్లను కొనుగోలు చేయగా వాటిని ఈవో అందజేశారు. అనంతరం ఆయన సత్యదేవుని దర్శనం చేసుకున్నారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఇటీవల ప్రసాద్ స్కీం నిధులతో ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించిన అన్నదాన భవన నిర్మాణ స్థలం వద్ద కొబ్బరికాయ కొట్టారు. కార్యక్రమంలో చైర్మన్ ఐ.వి రోహిత్, పీఆర్వో కృష్ణారావు, ఇంజనీరింగ్ అధికారులు నరసింహారెడ్డి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


మంత్రికి స్వామివారి ప్రసాదం అందిస్తున్న ఈవో

శృంగారవల్లభ స్వామి ఆలయానికి భక్తుల తాకిడి


పూజలందుకుంటున్న స్వామి, అమ్మవార్లు

పెద్దాపురం, మార్చి 16: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునే బారులు తీరారు. టికెట్ల విక్రయం ద్వారా రూ. 2,70,530 అన్నదాన విరాళాలు ద్వారా రూ.38,309 ఆదాయం, కేశఖండన ద్వారా రూ. 6,920, తులాభారం ద్వారా రూ.350 వెరసి రూ.3,16,109 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 8 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం చైర్మన్ కర్రి జగదీష్, దేవస్థానం అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆలయం కిటకిట


తరలివచ్చిన భక్తులు



ఆత్రేయపురం, మార్చి 16: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, ఐశ్వర్యలక్ష్మీ హోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని భారీ క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. తలనీలాలు, తులాభారాలు, కానుకలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను భక్తులను అలరించాయి. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.39.75 లక్షలు లభించినట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.

సర్వర్ల మొరాయింపు.. భక్తుల ఇక్కట్లు

వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సర్వర్లు మొరాయించడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆలయంలో అన్ని సేవలు ఆన్‌లైన్ చేయడంతో సర్వర్లు ఒక్కసారిగా పనిచేయకపోవడంతో భక్తులు ఇక్కట్లకు గురయ్యారు. ఆన్‌లైన్ దర్శన టిక్కెట్లు, లడ్డూ ప్రసాద టిక్కెట్లు కోసం క్యూలైన్ల ద్వారా గంటల తరబడి వేచి ఉన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఇదే పరిస్థితి కొనసాగడంతో ఆఫ్‌లైన్లలో ఏర్పాట్లు నిర్వహించారు. స్వామివారి దర్శనం, లడ్డూ ప్రసాదాల కోసం భక్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఆలయ స్వర్ణ శిఖర ప్రతిష్ఠ పూజలు


ప్రత్యేక అభిషేకాలు నిర్వహించిన ఆలయ పండితులు

తరలివచ్చిన భక్తులు

ఆత్రేయపురం, మార్చి16: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వర్ణశిఖర ప్రతిష్ఠా పూజలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రోత్సాహంతో దాతలు ముందుకు వచ్చి రూ.35 లక్షలతో స్వర్ణశిఖరాలను సమర్పించారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు వసంత మండపంలో దాతలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవకళశారాధన, కుంభ ఆవాహన, శిఖరగర్త సంప్రోక్షణ, శిఖర అభిషేకం, సాయంత్రం అష్టోత్తర కలశారాధన, పంచసయ్యాదివాసం, చతుర్వేద స్వస్తి తదితర కార్యక్రమాలను వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు నడుమ ఘనంగా నిర్వహించారు. శ్రీవేంకటేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, అన్నపూర్ణసమేత విశ్వేశ్వరస్వామి, మహాలక్ష్మీ అమ్మవార్ల ఆలయాలలో శిఖర ప్రతిష్ఠా మహోత్సవం ఉదయం ఘనంగా నిర్వహిస్తారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్, దాతల కుటుంబ సభ్యులు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో అదనపు జిల్లా కోర్టు

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 16: రామచంద్రపురంలో జిల్లా అదనపు, సెషన్స్ కోర్టు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. రామచంద్రపురం, కె.గంగవరం, రాయవరం, బిక్కవోలు, అనపర్తి, మండపేట, కపిలేశ్వరపురం, ఆలమూరు మండలాల పరిధికి సంబంధించి అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు ఏర్పాటుకు న్యాయశాఖ ప్రభుత్వ కార్యదర్శి జి.సత్యప్రభాకరరావు జీవో ఎం.ఎస్ నెం.53ను శుక్రవారం జారీ చేశారు. జిల్లా కోర్టు ఏర్పాటుకు జిల్లా జడ్జి, ముఖ్య పరిపాలనాధికారి, పర్యవేక్షకుడు, ట్రాన్స్‌లేటర్, సీనియర్ సహాయకుడు, స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 1, జూనియర్ సహాయకులు 5, టైపిస్టులు 3, అమీనాలు 3 ఇలా మొత్తం 31 పోస్టులు మంజూరు చేస్తూ జీవో జారీ చేశారు. రామచంద్రపురంలో అదనపు జిల్లా కోర్టు ఏర్పాటుకు కృషి చేసిన మంత్రి వేణుగోపాలకృష్ణ, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ జిల్లా కలెక్టరు హిమాన్షు శుక్లాకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీ, కార్యదర్శి వాడ్రేవు సాయి ప్రసాద్, ఉపాధ్యక్షుడు డి.ఎస్.ఎస్ శర్మ, పలివెల సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి వీర్రెడ్డి, కోశాధికారి జె.ఎస్.ఎస్.చక్రవర్తి, మహిళా ప్రతినిధి కె.సత్యవాణి, జూనియర్ ప్రతినిధి పిల్లా పృథ్వీరామయ్య కృతజ్ఞతలు తెలిపారు.

హైవేపై రెండు కార్ల ఢీ


క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

గొల్లప్రోలు, మార్చి 16: కాకినాడ జిల్లా గొల్లప్రోలు బైపాస్ రోడ్డులో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు వ్యక్తులకు గాయాలయ్యాయి. గొల్లప్రోలు మండలం తాటిపర్తి నుంచి వస్తున్న కారు 216 జాతీయ రహదారిపై భోగాపురం జంక్షన్ వద్ద ప్రత్తిపాడు వెళ్లేందుకు మలుపు తిరుగుతుండగా, వాడపల్లి దర్శనం ముగించుకుని విశాఖపట్నం వెళుతున్న కారు వేగంగా ఢీకొట్టింది. దీంతో ప్రత్తిపాడు వైపు వెళుతున్న కారు వ్యాన్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో ఎనిమిదేళ్ల బాలుడితో సహా ఆరుగురికి గాయాలయ్యాయి. బాలుడితో పాటు మరో మహిళకు తీవ్రగాయాలయ్యాయి. వారిని హైవే పోలీసులు అంబులెన్స్‌లో పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నేడు ఆర్థ్రోప్లాస్టీ సదస్సు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 16: స్థానిక ఆర్యాపురం సాయి హాస్పిటల్‌లో రాజమండ్రి ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గోదావరి ఆర్థ్రోప్లాస్టీ సదస్సును నిర్వహిస్తున్నామని కార్యనిర్వాహక కార్యదర్శి ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కె.విజయకుమార్ తెలిపారు. జాతీయ స్థాయిలో నిపుణులైన వైద్యులు ఈ సదస్సుకు హాజరై కీళ్ల మార్పిడి సర్జరీల్లో మెలకువలు, కొత్త పోకడలు, నైపుణ్యాల పెంపునకు అవసరమైన పరిజ్ఞానాన్ని వివరిస్తారన్నారు. అలాగే వారు గోదావరి జిల్లాల వైద్యులతో ముఖాముఖి చర్చించి ఆధునిక విధానాలను తెలియజేస్తారని చెప్పారు. సదస్సుకు కోయంబత్తూరులోని గంగా ఆసుపత్రి డాక్టర్ పి.ధనశేఖర్ రాజా, ఆస్టర్ ఆసుపత్రి డాక్టర్ జేవీ శ్రీనివాస్ హాజరవుతారని విజయకుమార్ తెలిపారు.

పంట కాల్వలో మొసలి?





అమలాపురం రూరల్, మార్చి 16: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఈదరపల్లి ప్రధాన బెండా కెనాల్‌లో శనివారం మధ్యాహ్నం మొసలి ప్రత్యక్షమైందన్న సమాచారం అందరిలోను భయాందోళనకు గురి చేసింది. ఈదరపల్లి పంచాయతీ కార్యాలయం ఎదుట ప్రధాన పంటకాల్వలో మొసలి గట్టుపైకి ఎక్కుతుండగా అవతలి ఒడ్డున ఉంటున్నవారు సెల్‌ఫోన్లో ఫొటోలను తీశారు. గట్టుపైకి ఎక్కిన మొసలిని గుర్తించేందుకు స్థానికులు శతవిధాలా ప్రయత్నించారు. అయితే అవతలి నుంచి ఫొటోలు తీసి ఇవతలి గట్టుకు వచ్చేసరికి మొసలి తిరిగి పంటకాల్వలోకి వెళ్లిపోయి ఉండవచ్చునని భావిస్తున్నారు. మొసలిని ప్రత్యక్షంగా చూసామని స్థానిక మహిళలు చెబుతున్నారు. అయితే అది మొసలి కాదని ఉడుము అయి ఉండవచ్చునని కొందరు చెబుతున్నప్పటికీ ఉడుము అంత పెద్ద ఆకారంలో ఉండే అవకాశం లేదని మరికొందరు అంటున్నారు. ఏది ఏమైనా జాగ్రత్తగా ఉండాలని పంచాయతీ అధికారులు చెబుతున్నారు.

కుసుమ ధర్మన్న రచనలు స్ఫూర్తిదాయకం

నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య పద్మరాజు

దివాన్‌చెరువు, మార్చి16 : కుసుమ ధర్మన్న రచనలు స్ఫూర్తిదాయకమని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని కుసుమ ధర్మన్న కళాపీఠం ఆధ్వర్యంలో మహాకవి కుసుమ ధర్మన్న 125వ జయంత్యుత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. నన్నయ తెలుగు శాఖ నిర్వహణలో తెలుగు జాతీయ సదస్సు కవి సమ్మేళనం, కుసుమ ధర్మన్న సాహితీ పురస్కారాలు ప్రదాన కార్యక్రమాలు జరిగాయి. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ 1921 సంవత్సరంలో గరిమెళ్ల సత్యనారాయణ రాసిన మాకొద్దీ తెల్లదొరతనం గేయానికి భిన్నంగా నల్లదొరలు పాలన వచ్చినంత మాత్రాన హరిజనులకు ఒరిగేదేమీ ఉండదని నిర్మోహమాటంగా మాకొద్దీతెల్లదొరతనం ప్రతిగేయం రాసిన తొలిదళిత విప్లవకవి కుసుమ ధర్మన్న అని కొనియాడారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద్ మూర్తి మాట్లాడుతూ కుసుమ ధర్మన్న సాహిత్యంతో సమాజాన్ని చైతన్యవంతం చేసిన విధానాలు తెలిపారు. మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకర్ సామాజిక ఆత్మగౌరవం, చైతన్యం కుసుమ ధర్మన్న అనే అంశంపై ప్రసంగించారు. కుసుమధర్మన్న కళాపీఠం అధ్యక్షురాలు రాధా కుసుమ మాట్లాడుతూ రాజమహేంద్రవరానికి చెందిన కుసుమ ధర్మన్న విగ్రహాన్ని నగరంలో ఏర్పాటు చేయాలని కోరారు. కుసుమ . ధర్మన్న కళా పీఠంచే సాహితీ సేవా పురస్కారాన్ని నన్నయ తెలుగుశాఖ అధ్యాపకుడు తరపట్ల సత్యనారాయణకు వీసీ ప్రదానం చేశారు. 40 మంది అధ్యాపకులు, పరిశోధకులు పత్రసమర్పణలతో ముద్రించిన పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించారు. కుసుమ ధర్మన్న సాహితీ ప్రస్థానం సామాజిక సేవ అనే అంశంపై జాతీయ స్థాయిలో 53 మంది కవులు కవితాగానం చేశారు. కార్యక్రమంలో నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ డి.జ్యోతిర్మయి, ఆంధ్ర విశ్వ విద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ బూసి వెంకటస్వామి, వీఎస్ఎం కళాశాల తెలుగు శాఖాధిపతి ర్యాలి శ్రీనివాసు, కందుకూరి వీరేశలింగం కళాశాల శాఖాధిపతి పి.వి.బి.సంజీవరావు, నన్నయ తెలుగుశాఖ కోర్సు కోఆర్డినేటర్ కె.వి.ఎన్.డి.వరప్రసాద్, అధ్యాపకులు తలారి వాసు, డి.లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.


కుసుమ ధర్మన్న సాహిత్య పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

పనులు పూర్తి కాకుండానే ప్రారంభోత్సవాలు!

ఎన్నికల కోడ్ రాక ముందే అధికార పార్టీ నేతల హడావిడి


ప్రారంభిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ


అసంపూర్తిగా మిగిలిన ఆలయం పనులు

తుని రూరల్, మార్చి 16: ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్ విడుదల అవుతున్న తరుణంలో అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు హడావిడిగా శంకుస్థాపనలు చేయడం మొదలుపెట్టారు. అలాగే పనులు పూర్తి కాకపోయినా ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. లోవ దేవస్థానం ప్రధాన గోపురం పనులు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. పనులు నిరాటంకంగా కొనసాగితే మరో రెండు నెలలకు కానీ పూర్తవ్వవు. ఈ లోపు ఎన్నికలు వచ్చేయడంతో హడావిడిగా ప్రారంభోత్సవానికి ఆదేశాలు ఇవ్వడంతో అధికారులు నిబంధనలు పక్కన పెట్టి చకచకా ఏర్పాట్లు చేశారు. కోడ్ అమలుకు నాలుగు గంటల ముందే దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆలయానికి చేరుకుని స్థానిక వైసీపీ నాయకులు, ట్రస్టుబోర్డు సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఆలయ నిర్మాణంలో ఉన్న శ్లాబ్‌కు ఏర్పాటు చేసిన సెంట్రింగ్ కర్రలను అత్యవసరంగా తొలగించి ఆలయానికి పక్కాగా ఏర్పాటు చేయాల్సిన తలుపులకు బదులు డమ్మీ తలుపులు ఏర్పాటు చేసి హడాహుడిగా ఆలయాన్ని ప్రారంభించడం పట్ల భక్తులు దుమ్మెత్తి పోస్తున్నారు. పనులు పూర్తయ్యాక శాస్త్రోక్తంగా జరగాల్సిన కార్యక్రమం హడావిడిగా చేయడం ఏమిటని పలువురు పండితులు, భక్తులు ప్రశ్నిస్తున్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం

తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ సునీత

రాజమహేంద్రవరం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌లో శనివారం భారీగా కేసులను పరిష్కరించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత కార్యక్రమాన్ని ప్రారంభించి పర్యవేక్షించారు. సాయంత్రం 6 గంటల సమయానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా వివిధ కోర్టుల్లో ఏర్పాటు చేసిన బెంచ్‌లలో క్రిమినల్ 1013, సివిల్ 379 కలిపి మొత్తం 1513 కేసులకు పరిష్కారం చూపించారు. సుమారు రూ.2,30,00,000 పరిహారాన్ని ఆయా సంస్థల ద్వారా బాధితులకు అందజేసేలా అవార్డులు ప్రకటించారు. జిల్లా ప్రధాన న్యాయస్థానంలో విచారణలో ఉన్న ఒక రోడ్డు ప్రమాదం కేసు (ఎంవీఓపీ 316/2021)కు సంబంధించి బాధితురాలికి ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా రూ.1,12,00,000 పరిహారాన్ని అందజేసే విధంగా పరిష్కారం చూపారు. బాధితురాలి సమస్యకు సత్వర న్యాయం అందజేయడంలో చొరవ చూపిన డీఎల్ఎస్ఏకి, ఆమె న్యాయవాదులు ఎస్‌జీ శంకర్, కె.నరసింహారావు, బీమా సంస్థ న్యాయవాది దునే శ్రీనివాసరావు, చోళ మండలం బీమా సంస్థకు పీడీజే సునీత అభినందనలు తెలిపారు.

బదిలీ అయ్యారు..వెంటనే తిరిగొచ్చారు

రాజమహేంద్రవరంరూరల్; మార్చి 16: వడ్డించే వాడు మనవాడైతే బంతిలో చివర కూర్చున్న అందుతుంది అంటారు.. రాజమహేంద్రవరం రూరల్ మండలంలో ఓ బదిలీ అంశాన్ని పరిశీలిస్తే ఇదే అర్థమవుతుంది. డా. బీ ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం రెగ్యులర్ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తూ రాజమహేంద్రవరం రూరల్ మండలం ఎంపీడీవోగా శ్రీనివాసరావు ఇన్‌చార్జి విధులు నిర్వహిస్తున్నారు. భారతీయ ఎన్నికల సంఘం (ఈసీఐ) గైడ్‌లైన్స్ ప్రకారం పంచాయతీ రాజ్ కమిషనర్(పీఆర్అండ్ఆర్‌డీ) తాడేపల్లి, కోనసీమ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు ప్రకారం ఎంపీడీవో శ్రీనివాసరావును డిప్యూటేషన్ రద్దు చేస్తూ అంబాజీపేట ఎంపీడీవోగా చార్జి తీసుకోవాలంటూ ఈనెల 15న ఉత్తర్వులు జారీ చేశారు. రూరల్ మండలంలో ఈవోపీఆర్‌డీగా పనిచేస్తున్న డి. బాబూరావును ఎంపీడీవోగా ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే 24 గంటలు గడవక ముందే అంబాజీపేట నుంచి తిరిగి రాజమహేంద్రవరం రూరల్ మండలానికి శ్రీనివాసరావుకు పోస్టింగ్ ఇస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ కన్నబాబు ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ సీఈవో ఈనెల 16న ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ప్రభుత్వ సంక్షేమ పథకాలు పంపిణీ కార్యక్రమంలో ఎంపీడీవో కీలకపాత్ర పోషించి అధికార పార్టీకి చెందిన ఓ నేత అండదండలు, ఆయన మెప్పును పొందారని, దీంతో ఎలక్షన్ కమిషన్ నిబంధనలు కూడా పక్కన పెట్టి శ్రీనివాసరావు తిరిగి రాజమహేంద్రవరం రూరల్ మండలానికి రావడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ధాన్యం సొమ్ము కోసం రైతుల ధర్నా


ఆందోళన చేస్తున్న రైతులు

రాజవొమ్మంగి మార్చి 16: రాష్ట్ర ప్రభుత్వం రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసి నేటి వరకు సొమ్ములు చెల్లించకపోవడంతో రాజవొమ్మంగి రైతు భరోసా కేంద్రం వద్ద శనివారం రైతులు ధర్నా నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, దూసరపాము ఎంపీటీసీ నల్లా సత్తిబాబు, కొండపల్లి సర్పంచ్ కుంజం జగన్నాథం ఆధ్వర్యంలో సుమారు 50 మంది రైతులు ధర్నా నిర్వహించారు. ధర్నాలో రైతులు, నాయకులు మాట్లాడుతూ నామమాత్రంగా కొందరికి మాత్రమే సొమ్ములు చెల్లించారని ఇంకా రూ.కోట్లలో బకాయి ఉందని అన్నారు. వ్యవసాయశాఖ అధికారి రమేష్ నాయుడుకు వినతిపత్రం అందించారు. అయితే వ్యవసాయ శాఖ అధికారికి వినతిపత్రం ఇచ్చినా, ధర్నా నిర్వహించినా తమ సమస్య పరిష్కారం అయ్యేలా లేదని రైతులు అనుకుని సోమవారం రంపచోడవరం వెళ్లి అక్కడ అధికారులకు తెలియజేయాలని నిర్ణయించుకున్నారు.

నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

కరప, మార్చి 16: కరప చిరంజీవి కల్యాణమండపంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు బొండా సూర్యారావు తెలిపారు. ఆత్మీయ మరియు యునైటెడ్ ప్రవాస ఆత్మీయుల సొసైటీ ఆఫ్ అమెరికా కార్పొరేషన్ ఆధ్వర్యంలో ముమ్మిడి శ్రీరామారావు, నున్న నరసింహరావుల జ్ఞాపకార్థం పలు విభాగాల స్పెషలిస్టు వైద్యులచే ఏర్పాటుచేయనున్న శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

» అమలులోకి వచ్చిన కోడ్ » వెల్లడించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారులు

పెద్దాపురం, మార్చి 16: ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధమైనట్టు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జె.సీతారామారావు తెలిపారు. ఆర్డీవో కార్యాలయంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందని, ఎన్నికల కమిషనర్ నిబంధనలు తూచ తప్పకుండా పాటించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఎన్నికల కోడ్ నిబంధనలను ఉల్లంఘించకూడదన్నారు. కోడ్ అమలులోకి వచ్చినందున ఫారం 7, 8 దరఖాస్తులపై మార్పులు ఉండవని, ఓటరు నమోదుకు మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. రాజకీయ నాయకులు సభలు, సమావేశాలు ర్యాలీలకు సంబంధించిన అను మతులు తీసుకోవాలన్నారు. అలాగే 85 ఏళ్ల పైబడి, పోలింగ్ కేంద్రానికి రాలేనివారికి హోం ఓటింగ్ అవకాశం కల్పిస్తామన్నారు. నియోజకవర్గంలో ప్రస్తుతానికి 200 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 2,12,579 మంది ఓటర్లు ఉన్నారన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్లు కేవీ పద్మావతి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

'నియమావళికి లోబడి పని చేయాలి'

సర్పవరం జంక్షన్, మార్చి 16: రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి పని చేయాలని లేని ఎడల ఎన్నికల సంఘం తీసుకునే చర్యలకు గురికావాల్సి ఉంటుందని కాకినాడ రూరల్ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీవో ఇట్ల కిషోర్ స్పష్టం చేశారు. సర్పవరం జంక్షన్ తహశీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందన్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో 2,64,268 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. నియోజకవర్గంలో 264 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వీటిలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకున్నామన్నారు. ఏప్రిల్ 18న నోటిఫికేషన్ వెలువడుతుందని, ఏప్రిల్ 25 వరకు నామినేషన్లు స్వీకరణ, 26న పరిశీలన, 29న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. ఎన్నికల పోలింగ్ మే 13న జరుగుతుందని, జూన్ 4న లెక్కింపు ఉంటుందన్నారు. తహశీల్దార్ బి.విజయప్రసాద్, ఎన్నికల డీటీ సురేష్, మధుకిరణ్ పాల్గొన్నారు.

'ఫ్లెక్సీలు తొలగించాలి'

ప్రత్తిపాడు, మార్చి 16: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినందున వెంటనే ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, పోస్టర్‌లు తొలగించాలని ఎన్నికల రిటర్నిగ్ అధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పబ్లిక్‌ప్రదేశాల్లో ఉన్న విగ్రహాలకు తెల్లటి వస్త్రంతో ముసుగు వేయాలని, విద్యుత్ స్తంభాలు, బస్టాండ్‌లు, బహిరంగ ప్రదేశాల్లో ఉన్నజెండాలు, ప్రకటనలు తొలగించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ పార్టీలకు అనుకూలంగా వ్యవహరించినా, ఆయా పార్టీలు నిర్వహించే ప్రచారాల్లో పాల్గొన్నా క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఏఆర్వోలు నరసింహారావు, విద్యాపతి, ఎలక్షన్ డీటీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'అమల్లోకి వచ్చిన ఎంసీసీ'

జగ్గంపేట, మార్చి 16: కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో శనివారం నుంచి మండలంలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ) అమల్లోకి వచ్చిందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. జగ్గంపేటలోని తహశీల్దార్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికలకు నియోజకవర్గంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి, గోకవరం మండలాల్లో మొత్తం 245 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో ఉన్న రాజకీయ పార్టీల ఫొటోలు, ఫ్లెక్సీలు తొలగించాలని ఆదేశించారు. అన్ని మండలాల్లో విస్తృతంగా సోదాలు నిర్వహిస్తామని తెలిపారు.



పెద్దాపురంలో మాట్లాడుతున్న ఆర్డీవో

ఫ్లెక్సీలు, హోర్డింగ్‌ల తొలగింపు

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 16: ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. శనివారం నుంచే పారిశుధ్య విభాగం, పట్టణ ప్రణాళిక, డీఆర్ఎఫ్ బృందాలు నగరవ్యాప్తంగా తిరుగుతూ ప్రభుత్వ, ప్రైవేట్ భవనాలు, బస్‌షెల్టర్లు, బ్రిడ్జిలు, బస్టాండ్లు, బస్సులు, మున్సిపల్ కార్పొరేషన్ పార్కు స్థలాలు, డివైడర్లపై రాసిన రాతలు తొలగించేందుకు తెల్ల పెయింట్ వేసే పనులు ప్రారంభించారు. రహదారులకు ఇరువైపులా ఉన్న ప్రచారబోర్డులు, ఫ్లెక్సీలు, అతికించిన గోడపత్రికలు తొలగిస్తున్నారు. అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తే ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చర్యలు ఉంటాయని హెచ్చరిస్తున్నారు. నగరంలో కోడ్ పర్యవేక్షణ, అనధికారిక గోడపత్రికలు, ఫ్లెక్సీలు, కటౌట్లు తొలగించేందుకు, వాల్‌రైటింగ్, గోడపత్రికలు, కరపత్రాలు వంటివి ఎప్పటికప్పుడు తీసేయడానికి మూడు బృందాలను ఏర్పాటు చేస్తూ కమిషనర్ జె.వెంకటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు.

సామర్లకోట: మండల పరిధిలో పంచాయతీ కార్యాలయాల వద్ద ఉన్న అధికార పార్టీ ఫ్లెక్సీలను తొలగించడమే గాక రాజకీయ నాయకులు విగ్రహాలను వస్త్రాలతో కట్టి మూసివేశారు. మండల మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అధికారి, ఎంపీడీవో శ్యామ్ సుందర్ శనివారం తన కార్యాలయంలో సమావేశంలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ నిభందనలను వివరిం చారు.

గొల్లప్రోలు: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి రావడంతో గొల్లప్రోలు పట్టణంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలు వద్ద ఉన్న రాజకీయ పార్టీలు, పోటీలో నిలవనున్న నేతల ఫోటోలు ఉన్న ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను అధికారులు తొలగించారు.



కాకినాడ సచివాలయంలో నవరత్నాలు బోర్డు తొలగిస్తున్న సిబ్బంది

'ప్రజాగళం సభకు కార్యకర్తలు తరలిరావాలి'

జగ్గంపేట, మార్చి 16: చిలకలూరుపేటలో జనసే, టీడీపీ, బీజేపీ ఉమ్మడిగా నిర్వహించే ప్రజాగళం సభకు జగ్గంపేట నుంచి టీడీపీ కార్యకర్తలు తరలిరావాలని ఉమ్మడి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ కోరారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ ఆదివారం చిలకలూరిపేట మండలం బొప్పూడిలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద మధ్యాహ్నం 4 గంటలకు జరిగే ప్రజాగళం భారీ బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి, గోకవరం మండలాల నుంచి 260 కార్లతో జగ్గంపేట టీడీపీ కార్యాలయం నుంచి ఉదయం 7గంటలకు బయల్దేరి వెళ్తున్నామని తెలిపారు. ప్రధాని మోదీ, పవన్, చంద్రబాబు ఈ సభ నుంచి ఎన్నికల శంఖారావం పూరిస్తారన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, అడబాల భాస్కరావు, తమటం వీరభద్రరావు, కమ్మిల వెంకటేశ్వరరావు, బీజేపీ నేతలు వేగి భద్రం, మండపాక అప్పన్నదొర తదితరులు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్: టీడీపీ-జనసేన, బీజేపీల ఆధ్వర్యాన చిలకలూరిపేట బొప్పూడిలో ఆదివారం నిర్వహించే ప్రజాగళం బహిరంగ సభ విజయవంతం కోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, టీడీపీ కాకినాడ రూరల్, కరప మండలాల అధ్యక్షులు రాందేవు సీతయ్యదొర, దేవు వెంకన్న కోరారు. శనివారం కాకినాడలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ మూడుపార్టీల కూటమితో ఎన్నికలకు ప్రజల ముందుకు వెళుతున్నామన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రజాగళం బహిరంగ సభ నిర్వహిస్తున్నారని, ఈ సభలో ప్రధాని మోదీ, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్‌లు ఒకే వేదికపై పాల్గొంటారన్నారు.

'జగన్ అరాచక పాలన అంతానికి కౌంట్ డౌన్'

సర్పవరం జంక్షన్, మార్చి 16: ఒక్క ఛాన్సంటూ అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ ప్రభుత్వ అరాచక పాలన అంతానికి ఎన్నికల నోటిఫికేషన్ జారీతో కౌంట్ డౌన్ ప్రారంభమైందని టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి అన్నారు. శనివారం కేంద్ర ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జగన్ ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. ప్రజలు, ఉద్యోగుల వ్యతిరేఖ విధానాలతో రాష్ట్రం అన్ని రంగాల్లో నష్టపోయిందన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయా, ఎప్పుడు వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపుదామా అని ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా అధికారంలోకి వచ్చేది టీడీపీ మిత్రపక్ష కూటమిదేనన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు తారాజువ్వలు, బాణసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు కో కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ), ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొల్లాబత్తుల అప్పారావు, బొజ్జ సాంభశివరావు, మిరపల ప్రకాశ్ ఉన్నారు.

'ప్రజలకు విముక్తి కలిగించడమే లక్ష్యం'

కాకినాడ సిటీ, మార్చి 16: వైసీపీ ప్రభుత్వ అరాచక, విధ్వంసక పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి కలిగించడమే టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి లక్ష్యమని, ఆ దిశగా రాబోయే ఎన్నికల్లో ముందుకు వెళ్తామని మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు, బీసీ డిక్లరేషన్ పోస్టర్‌లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ అరాచక, అవినీతి, అసమర్థత పాలనలో అన్నివర్గాల ప్రజలు దగా పడ్డారన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నిమ్మగడ్డ జగదీష్, తుమ్మల రమేష్, గదుల సాయిబాబు, అమస్‌జైన్, వొమ్మి బాలాజీ, పలివెల రవి అనంతకుమార్, గాది శివరామకృష్ణ, బంగారు సత్యనారాయణ, అంబటి చిన్న, చొల్లంగి వీరబాబు, మేడిశెట్టి చిన్ని, ఎస్‌కే రహీమ్, చింతా పేర్రాజు, నిద్రబింగి సత్తిబాబు, సంగాని నాగేశ్వరరావు, పసుపులేటి వెంకటేశ్వరరావు, బొంతు ప్రసాద్, చొక్కాగిరి పాల్గొన్నారు.

'పంతం నానాజీ గెలుపునకు కృషి'

వేళంగి (కరప), మార్చి 16: పొత్తు ధర్మం పాటించి ఈ ఎన్నికల్లో కాకినాడ రూరల్ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ గెలుపు కోసం కృషి చేయాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా కార్యకర్తలకు సూచించారు. వేళంగిలో శనివారం ఆయన పార్టీ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో తాను చేసిన సేవలకు గుర్తింపు దక్కకపోవడం బాధాకరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తలు, అభిమానులు సంయమనం పాటించి పార్టీ గెలుపునకు సమిష్టిగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. తనకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నానని, పార్టీ అధినేత చంద్రబాబు పిలుపు కోసం ఎదురుచూస్తున్నానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కాకరపల్లి చలపతిరావు, కొండ వినాయక్, కొప్పిశెట్టి తలుపులయ్య, కడియం చిన్న, అడపా వీరభద్రరావు, గరగ మాణిక్యం, వనుం అన్నవరం, కంచి కొండ, పితాని శ్రీను, వనుం శ్రీను, హరిప్రతాప్ పాల్గొన్నారు.

'చెక్‌పోస్టుల వద్ద పటిష్టమైన నిఘా'

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 16: రానున్న ఎన్నికల నేపథ్యంలో కాకినాడ ముఖద్వారాల వద్ద ఏర్పాటు చేసే చెక్‌పోస్టుల వద్ద పటిష్టవంతమైన నిఘా ఏర్పాటు చేయాలని సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కార్పొరేషన్ కమిషనర్ జె.వెంకటరావు ఆదేశించారు. పోలీస్, రెవెన్యూ, ఎన్నికల సిబ్బందితో కలిసి నిఘా ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాలను శనివారం సందర్శించారు. ముఖద్వారాలైన ప్రతాప్‌నగర్ వంతెన, ఉప్పలంక జంక్షన్, కుంభాభిషేకం రేవు ప్రాంతాల్లో స్టేటిక్ సర్వేలైన్స్ బృందాల పర్యవేక్షణ చేయాల్సిన అంశాలపై అధికారులతో చర్చించారు. డీఎస్పీ హనుమంతరావు, ఎస్ఈ పి.సత్యకుమారి, స్మార్ట్‌సిటీ ఎస్ఈ పి.వెంకటరావు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఈఈ మాధవీ, తహశీల్దార్ దొర, ఏఈ వై.నాగేశ్వరరావు ఉన్నారు.

'కాపుల అనుమతితో రాజకీయాల్లోకి రాలేదు'

కిర్లంపూడి, మార్చి 16: కాపుల అనుమతితో రాజకీయాల్లోకి రాలేదు. రాజకీయాల్లోకి రావడానికి ఎవరి అనుమతి తీసుకోనవసరంలేదు. మొలతాడు, లాగూ లేనోడు నాకు రాజకీయ పాఠాలు చెపుతున్నారని, ఇది చాలా తప్పని, బాధాకరంగా ఉందని వైసీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం అన్నారు. శనివారం కిర్లంపూడి ఆయన స్వగృహంలో విలేకర్లతో మాట్లాడుతూ ప్రత్తిపాడు ప్రజల భిక్షతోనే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. వైసీపీ పెద్దలు తన స్వగృహానికి వచ్చి ఆహ్వానించారు. అప్పట్లో చంద్రబాబు ఆహ్వానం మేరకు అప్పుడు రాజకీయ పెద్దలు ఇంటికొచ్చి ఆహ్వానిస్తేనే చంద్రబాబు దగ్గరికి వెళ్లానని, పవన్ కల్యాణ్ తమ ఇంటికి వస్తానని చెప్పి రాలేదని చెప్పారు.

'పవన్‌ను గెలిపించుకుందాం'

పిఠాపురం, మార్చి 16: జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని సాయిప్రియ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్ తెలిపారు. పిఠాపురం నియోజకవర్గంలో పవన్‌కల్యాణ్ గెలుపు-చారిత్రక అవసరం పేరుతో శ్రీనివాస్ రూపొందించిన కరపత్రాల పంపిణీని పిఠాపురం పశువుల సంత వద్ద ప్రారంభించారు. నియోజకవర్గంలో ప్రతి ఇంటికి కరపత్రాలు అందజేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అల్లం కిషోర్, అమజాల సుబ్బారావు, అల్లాడ కన్నారావు, బంగారు లక్ష్మి, ముత్యాల భువనేశ్వరీ, అల్లం రాజేశ్వరీ, రాయవరపు శారద పాల్గొన్నారు.

'ఓటు అడిగే అర్హత కోల్పోయిన వైసీపీ'

తాళ్లరేవు, మార్చి 16: చొల్లంగిలో ప్రజలను ఓటు అడిగే అర్హతను వైసీపీ కోల్పోయిందని, 46రోజులుగా ఇళ్ల స్థలాల కోసం మహిళలు దీక్షలు చేస్తుంటే దొంగ రాజకీయాలు చేశారని ఎంపీటీసీ గ్రే సాయిమహాలక్ష్మి విమర్శించారు. శనివారం చొల్లంగి నిరసనకారులకు ఆమె మద్దతు తెలిపారు. స్థానికంగా ఉన్న స్థలాలను స్థానికులకు ఇవ్వకుండా ఇతరులకు ఇచ్చేందుకు ప్రయత్నించిన వైసీపీ ప్రయత్నాలు ఎన్నికల కోడ్‌తో ముగిసిపోయాయన్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదలందరకీ ఇళ్ల స్థలాలు ఇస్తామన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా చొల్లంగిలో నిరసన దీక్షను విరమింపజేశారు.

అంబేడ్కర్, పూలే విగ్రహాల ఆవిష్కరణ

జగ్గంపేట, మార్చి 16: జగ్గంపేట హైస్కూల్ ప్రాంగణం ఆవరణలో బయట తుమ్మలపల్లి రమేష్, పాము సూరిబాబు ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, మహాత్మ జ్యోతిరావుపూలే విగ్రహాల ఆవిష్కరణ పులి ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా ఆర్‌పీఐ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.వెంకటస్వామి, కాకినాడ పార్లమెంట్ వైసీపీ అభ్యర్థి చలమల శెట్టి సునీల్ హాజరై విగ్రహాలు ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తుమ్మలపల్లి రమేష్, సీనియర్ నాయకుడు జేబి రాజు, ఆర్‌పీఐ జాతీయ కార్యదర్శి పేరం శివనాగేశ్వరరావు, అజయ్ ప్రసన్న పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ

సర్పవరం జంక్షన్, మార్చి 16: ఆంధ్రకాపు సద్భావన సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆర్డీవో ఆఫీసు రోడ్డు సురేష్‌నగర్‌లో విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఆ స్మారక కళావేదిక గౌరవాధ్యక్షుడు కురసాల సత్యనారాయణ, ఆంధ్రకాపు సద్భావన సంఘం గౌరవాధ్యక్షుడు బసవా ప్రభాకరరావు ఆవిష్కరించారు. సంఘం ఉపాధ్యక్షుడు సేతు మాధవరావు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల మెంబర్ బిందాన సురేష్, బుజ్జి, మాధవరు పట్టాభిరామయ్య, దామిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చంద్రమౌళిని కలిసిన సుభాష్

కాకినాడ సిటీ, మార్చి 16: రామచంద్రపురం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుణ్ణం చంద్రమౌళిని శనివారం కాకినాడలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు టిక్కెట్ రావడంలో సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. చంద్ర మౌళిని పూలమాలతో సత్కరించారు. రామచంద్రపురం నియోజకవర్గానికి చెందిన వైసీపీ నేత దొంగల శ్రీధర్ తన మిత్రబృందంతో కలిసి వారి సమక్షంలో టీడీపీలో చేరారు.

2 నెలల్లో అంతంకానున్న వైసీపీ పాలన

ప్రత్తిపాడు ఉమ్మడి అభ్యర్థి సత్యప్రభ

రౌతులపూడి, మార్చి 16: వైసీపీ కిచక పాలన మరో 2నెలల్లో అంతమవుతుందని ప్రత్తిపాడు టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వరుపుల సత్యప్రభ అన్నారు. పి.చామవరం గ్రామంలో బాబుష్యూరిటీ - భవిష్యత్‌కు గార్యంటీ కార్యక్రమాన్ని ఆమె నిర్వహించి ఇంటింటికి వెళ్లి టీడీపీ చేపేట్టే అభివృద్ధి పనులు కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నందమూరిరాజా, సింహాద్రి పెదబాబు, పల్లా సూరిబాబు, మేడపాటి, రాంబాబు, పర్వత సురేష్, ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, పైలసాంబశివరావు, తిరుమల దొర, కోసూరి కృష్ణవర్మ, ఈగల సత్తిబాబు,సోమరౌతు రవి తదితరులు ఉన్నారు.



రౌతులపూడి:పి.చామవరం ప్రచారంలో సత్యప్రభ

ఏలేశ్వరం: పట్టణంలో మీకోసం మీఇంటికి మీసత్యప్రభ కార్యక్రమంలో భాగంగా వరుపుల సత్యప్రభ ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. జె.అన్నవరం గ్రామంలో శ్రీలవకుశలమ్మ విగ్రహప్రతిష్ఠలో పాల్గొన్నారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, మాజీ జడ్పీటీసీ జ్యోతుల పెదబాబు, బ్యాంక్ రాజు, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, భజంతుల మణి, టిడిపి నేతలు జిగటాపు సూరిబాబు, కొప్పుల బాబ్జి, షైరాల కనకారావు, చిక్కాల లక్ష్మణరావు, బూర్లు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

ప్రత్తిపాడు, మార్చి 16: మండలంలో చింతలూరుకు చెందిన నందవరపు శివ, అరటా ఏసుగదుల గోపాల్, నందవరపు నాని, చల్లా రాజు వంటి వైసీపీ కార్యకర్తలు ప్రత్తిపాడు వరుపుల సత్యప్రభ సమక్షంలో టీడీపీలో చేరారు. ఆ గ్రామ టీడీపీ నాయకులు జింకల తాతారావు, పోలినాటి భగవాన్ పాల్గొన్నారు. ఏలేశ్వరం మండలం యర్రవరం టీడీపీ నాయకులు ప్రత్తిపాడు విచ్చేసి సత్యప్రభను శాలువాతో సన్మానించారు.

టీడీపీలో రాజబాబు చేరిక



ముత్యం రాజబాబును అభినందిస్తున్న రాజప్ప

సామర్లకోట, మార్చి 16: సామర్లకోట పట్టణ సీనియర్ వైసీపీ నేత, లారీ యూనియన్ మాజీ అధ్యక్షుడు ముత్యం రాజబాబు వందమంది అనుచరులతో శనివారం తెలుగుదేశం పార్టీలోకి చేరారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్ తదితర పట్టణ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే చినరాజప్ప రాజబాబు, అనుచరులకు టీడీపీ కండువాలు కప్పి అభినందించారు. జగన్ ఒంటెద్దు పోకడలను భరించలేక జిల్లాల్లో వైసీపీ ఖాళీ అవుతుందని రాజప్ప ఎద్దేవా చేశారు. ఆ పార్టీలో ఇమడలేమంటున్న నాయకులు టీడీపీ వైపు చూస్తున్నారన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీతో కలిసి పనిచేసేవారికి ద్వారాలు తెరిచే ఉంటాయన్నారు. పార్టీలో ఇప్పటికే పనిచేస్తున్న సీనియర్లు కొత్తగా చేరిన వారిని కలుపుకుని రానున్న ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు.

జనసేనలో ఎస్సీ యువకుల చేరిక



పార్టీలో చేరిన ఎస్సీ యువకులతో పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, మార్చి 16: కాకినాడ రూరల్ సర్పవరం ఎస్సీపేటలో శనివారం రాత్రి మాజీ సర్పంచ్ పుల్ల శ్రీరాములు నేతృత్వంలో ఎస్సీ నాయకులు,11వ వార్డు సభ్యులు పులగల రాజ్‌కుమార్, ఈరుగుల ఆనంద్ నాయకత్వంలో సుమారు 200 మంది యువకులు, మహిళలు వైసీపీకి రాజీనామా చేసి జనసేన పార్టీలో చేరారు. వారికి కాకినాడ రూరల్ జనసేన-టీడీపీ,బీజేపీ ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ, జనసేన నాయకులు వాసంశెట్టి వెంకటేశ్వరరావు, కొప్పిశెట్టి సూరిబాబు, అనసూరి నారాయణరావు, సోడె ముసలయ్య, చైర్మన్ శ్రీను, ముద్దన ప్రకాశ్, పాలిక రమణ పాల్గొన్నారు.

యనమల దివ్య ప్రచారం

తొండంగి, మార్చి 16: బెండపూడి శివారు తమ్మయ్యపేట గ్రామంలో శనివారం తుని టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి యనమల దివ్య మీ ఇంటికి మీ దివ్య కార్యక్రమంలో భాగంగా ప్రచారం నిర్వహించారు. తాను పర్యటించిన అన్ని గ్రామాల్లో టీడీపీ, జనసేన కూటమికి అనూహ్య స్పందన లభిస్తోందని ఇదే రకమైన అభిమానాన్ని తనపై కొనసాగించి ఆశీర్వదించాలని దివ్య కోరారు. టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను ఇంటింటికి పంచారు. ప్రజలు తన తండ్రిని ఆదరించిన రీతిలో ఆదరించి విజయం అందించాలన్నారు. తెలుగుయువత జిల్లా అధ్యక్షులు యనమల శివ రామకృష్ణ, టీడీపీ, జనసేన మండలాధ్యక్షులు చొక్కా అప్పారావు, బెండపూడి నాయుడు, పేకేటి హరికృష్ణ, యనమల రాజేష్, కోడ వెంకటరమణ, సాధనాల నూకరాజు ఉన్నారు.


'లోక్‌అదాలత్‌లతో కేసుల సత్వర పరిష్కారం'

పిఠాపురం, మార్చి 16: లోక్ అదాలత్‌ల ద్వారా కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని 12వ అదనపు జిల్లా జడ్జి ఏ.వాసంతి తెలిపారు. పట్టణంలోని కోర్టుల ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. 75 కేసులు పరిష్కారమయ్యాయి. ఒక కేసులో న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ అందించిన చెక్కును కక్షిదారులకు అందజేశారు. అదాలత్ బెంచీల్లో అదనపు జిల్లా జడ్జి వాసంతి, మెజిస్ట్రేట్ ఎం.సాయిసుభాష్ నిర్వహించగా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రాజారావు, కె.భాస్కరరావు, ఎస్ఎం అలీ, కొశిరెడ్డి పేర్రాజు ఉన్నారు.

పెద్దాపురం: స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్‌అదాలత్ ద్వారా 21 కేసులు పరిష్కారం జరిగినట్టు ఏడవ అదనపు జిల్లా జడ్జి చంద్రమౌళీశ్వరి తెలిపారు. న్యాయమూర్తులు దీపా దివ్యకృప, హర్షవర్ధన్, న్యాయవాదులు బి.ప్రసాద్, మడికి రాంబాబు, ప్రభాజీ, పీఎల్వీలు నూతులపాటి అప్పలకొండ ఉన్నారు.

ప్రత్తిపాడు: లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం పొందవచ్చని ప్రత్తిపాడు జడ్జి ఎం.సుధారాణి చెప్పారు. స్థానిక కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులు 28, సివిల్ 5, బ్యాంక్ లిటికేషన్ 4, బీఎస్ఎన్ఎల్ 1కేసు పరిష్కారమయ్యాయి. బి.మధుబాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సి.పుల్లయ్య, సీనియర్ న్యాయవాది చలంకూరి రామకృష్ణ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు నివాళి



కరపలో శ్రీరాములు చిత్రపటానికి నివాళి

కరప, మార్చి 16: కరప మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైసీపీ మండలాధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, సర్పంచ్‌ల సమాఖ్య మండలాధ్యక్షుడు రొక్కాల గణిరాజు, ఏవో గుత్తుల భీమశంకరరావు, ఈవోపీఆర్డీ బీపీ సత్యనారాయణ, సిబ్బంది రాయుడు, భవానీ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పెద్దాపురం: ఆంధ్రరాష్ట్ర అవతరణకు మూలకారకుడు అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో సీతారామారావు, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కేవీ పద్మావతి నివాళులర్పించారు.

ఏలేశ్వరం: నగర పంచాయితీ కార్యాలయం వద్ద శ్రీరాములు విగ్రహానికి అలమండ చలమయ్య, శిడగం వెంకటేశ్వరరావు, కోర్రాద్రపసాద్, వి.బలరాం పూలమాలలేసి నివాళులర్పించారు.

తాళ్లరేవు: తాళ్లరేవు వాసవిక్లబ్ ఆధ్వర్యంలో శ్రీరాములు జయంతి సందర్భంగా సంతపేటలో చలివేంద్రం ప్రారంభించారు. హైస్కూల్లో ఉన్న గాంధీ, పొట్టిశ్రీరాములు విగ్రహాలకు పూలమాలలతో నివాళుర్పించారు. క్లబ్ అధ్యక్షులు అద్దేపల్లి సుధ, గోకవరపు శ్రీదేవి, అద్దేపల్లి సతీష్, కొత్త సుబాష్, పేకేటి సతీష్,సామా భగవాన్ ఉన్నారు.

సామర్లకోట: ఎంపీడీవో కార్యాలయంలో శ్రీరాములు చిత్రపటానికి ఎంపీడీవో శ్యామ్ సుందర్ పూలమాల వేసి నివాళులర్పించారు.

డాబా మీద నుంచి పడి వ్యక్తి మృతి

కాకినాడ రూరల్, మార్చి 16: రూరల్ మండలం రాజుల తూరంగికి చెందిన ఎం.వెంకటేశ్వర్లు(57) తమ ఇంటి డాబా మీదకు ఎక్కుతుండగా అనుకోకుండా కాలు జారడంతో డ్రైనేజీపై పడడంతో తలకు పెద్ద గాయం కావడంతో కాకినాడ జీజీహెచ్‌కు తరలిస్తుండగా మరణించాడని ఇంద్రపాలెం ఎస్ఐ మణికుమార్ తెలిపారు. మృతి చెందిన వ్యక్తి తూరంగి పంచాయితీలో స్వీపర్‌గా పనిచేసేవాడని, కొడుకు కొండబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు.

మహిళ అదృశ్యంపై కేసు

కొత్తపల్లి, మార్చి 16: మండలంలో మూలపేటకు చెందిన ఓ మహిళ కనిపించడంలేదంటూ కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్టు ఎస్ఐ స్వామినాయుడు చెప్పారు.

పోలీసుల కవాతు

కోటనందూరు, మార్చి 16: కోటనందూరు, పాతకొట్టాం, అల్లిపూడి, కెఇ చిన్నయ్యపాలెం, జగన్నాధపురం, బీమవరపుకోటలో గల సమస్యాత్మక గ్రామాల్లో సెంట్రల్ పోలీస్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని పార్టీలతో పాటు ప్రజలు సహకరించాలని తుని రూరల్ సీఐ ఎస్.మూర్తి కోరారు. ఎస్ఐ శంకర్‌రావు ప్రసాద్, బాలరాజు, జయరాం తదితరులున్నారు.

'జగనాసుర పాలన నుంచి విముక్తి'

పిఠాపురం, మార్చి 16: ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో రాష్ట్రానికి జగనాసుర పాలన నుంచి విముక్తి లభించిందని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ అన్నారు. వైసీపీ రాక్షసపాలన నుంచి ఆంధ్రప్రదేశ్‌కు విముక్తి లభించిందంటూ ఉదయ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి బాణాసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. జనసేన, బీజేపీ, టీడీపీ కూటమి వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మకు చంద్రబాబు ఎమ్మెల్సీ హామీ ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. పవన్‌కల్యాణ్ పిఠాపురం నుంచి లక్ష ఓట్లు మెజార్టీతో గెలవబోతున్నారని తెలిపారు. పవన్ గెలుపును అడ్డుకునేందుకు వైసీపీ కుట్రలు చేస్తున్నదని, అవి ఫలించవన్నారు. పవన్‌ను గెలిపించుకునేందుకు ప్రజలంతా ఎదురుచూస్తున్నారని తెలిపారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

తొండంగి, మార్చి 16: ఈ నెల 18 నుంచి జరగనున్న పదోతరగతి పరీక్షల నిర్వహణకు తొండంగి మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో షేక్ బాబ్జి తెలిపారు. తొండంగి, దానవాయిపేట, బెండపూడి, పెరుమాళ్ళపురం ఉన్నత పాఠశాలల్లో సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. దీని కోసం 55 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. తొండంగిలో 248, దానవాయిపేటలో 337 పెరుమాళ్ళపురంలో 287, బెండపూడిలో 200 మొత్తం 1072 మంది పరీక్షకు హాజరవుతున్నారన్నారు. తొండంగి, పెరుమాళ్లపురం, దానవాయిపేట సెంటర్లలో సీసీకెమేరాలు ఏర్పాటు చేశామన్నారు.

కరప: ఈనెల 18 నుంచి జరగనున్న పదోతరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఎంఈవోలు కొప్పుల బులికృష్ణవేణి, పత్తి సత్యనారాయణ తెలిపారు. మండల వ్యాప్తంగా 6పరీక్షాకేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. ఈసారి 1,003 మంది పరీక్ష రాయనున్నారన్నారు. కరపలో ఏ, బీ సెంటర్లతో బాటు వేములవాడ, వేళంగి, పెద్దాపురప్పాడు, గొర్రిపూడి హైస్కూళ్లలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

తాళ్లరేవు: మండలంలో పదోతరగతి పరీక్షల నిర్వహణకు అన్నిఏర్పాట్లు పూర్తిచేసినట్టు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. తాళ్లరేవు హైస్కూల్లో 507, పి.మల్లవరంలో 226, పటవలలో 228మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్టు తెలిపారు. 18న ఉదయం 9.30 నుంచి 12.45నిమిషాల వరకు జరుగుందని, విద్యార్థులు పరీక్షహాలుకు అరగంటముందుగా హాజరుకావాలన్నారు. పరీక్షలు జరిగే ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ప్రధానోపాధ్యాయులు జొన్నాడ ఆశాలత, కె.రాధాకృష్ణ, సీహెచ్‌కె.విశ్వనాధ్ స్పష్టం చేశారు.

టీడీపీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న దివ్య, షరీఫ్

తుని రూరల్, మార్చి 16: పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని ఉపవాస దీక్షలు ఆచరిస్తున్న ముస్లింలకు తుని టీడీపీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును నిర్వహించారు. కార్యక్రమానికి తుని టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి యనమల దివ్య, శాసనమండలి మాజీ చైర్మన్ అహ్మద్ షరీఫ్ హాజరయ్యారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం దివ్య మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీకి, ప్రజలకు మేలు జరగాలని ప్రభుత్వ ఏర్పాటుకు అల్లా ఆశీస్సులు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆవుగడ్డి వెంకటరమణ, షేక్ ఖాదర్ వల్లీ, షేక్ బాబ్జి, షేక్ వల్లీ, ముక్తార్, పలువురు ముస్లిం పెద్దలున్నారు.

వైభవంగా అపర్ణాదేవి కల్యాణం

గొల్లప్రోలు రూరల్, మార్చి 16: గొల్లప్రోలు మండలంలోని తాటిపర్తిలో అపర్ణా సమేత నాగేశ్వరస్వామి కల్యాణం శనివారం రాత్రి వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన మండపంపై స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచారు. వేదపండితులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రభాకరశాస్త్రిల వేదమంత్రోచ్ఛారణల మధ్య కల్యాణాన్ని జరిపించగా ఓలేటి వెంకట బంగారేశ్వరశర్మ వ్యవహరించారు. భక్తులు భారీగా తరలివచ్చారు. అంతకు ముందు కల్యాణ బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన, గరికపూజ నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు పెండ్లి కుమారుడు, కుమార్తెల అలంకారం చేశారు. సాయంత్రం అంకురార్పణ, ధ్వజారోహణం జరిగాయి. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

6న అంబేడ్కర్ స్మృతి కార్యక్రమం

ప్రత్తిపాడు, మార్చి 16: విజయవాడలో ఏప్రిల్ 6న నిర్వహించే అంబేడ్కర్ స్మృతి కార్యక్రమం విజయవంతం చేయాలని ఏఏఫ్ చైర్మన్ న్యాయవాది పినిపే వెంకట రామకృష్ణ కోరారు. చట్టసభల్లో నిర్ణయాధికారం ఒక గుర్తింపు కోసం ఈ కార్యక్రమం చేపట్టామని, రాష్ట్రంలోని ఎస్సీఎస్టీలకు చెందిన న్యాయవాదులు విజయవాడ కవాతుకు తరలిరావాలన్నారు. సమావేశంలో న్యాయవాదులు రాజాల చిట్టిబాబు, బొంగులూరు మధుబాబు, పిల్లి బలరాముడు,శివకుమార్ ఉన్నారు.

కోటనందూరులో 'బాబుష్యూరిటీ'

కోటనందూరు, మార్చి 16: బాబుష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో నిర్వహించారు. కెఏమల్లవరంలో పారుపల్లి శ్రీను, కోటనందూరులో టీడీపీ నేతలు టీడీపీ సూపర్‌సిక్స్ పథకాల కార్డులు ఇంటింటికి అందజేశారు. చిటికెల విజయ్, డి.చిరంజీవిరాజు, వెలగా వెంకట కృష్ణారావు, పంపనబోయిన దొంగబాబు, లగుడు సత్యనారాయణమూర్తి, అంకంరెడ్డి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

హడావుడిగా పైప్‌లైన్ పనులు

సామర్లకోట, మార్చి 16: సామర్లకోట తహశీల్దార్ కార్యాలయం వెనుక ఆక్రమణలదారులు నిర్మించిన ఇళ్లకు తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటుకు మున్సిపల్ అధికారులు అత్యుత్సాహం కనబర్చి హడావుడిగా పైప్‌లైన్ పనులు చేపట్టారు. ఎక్స్‌కవేటర్ సాయంతో సుమారు 150 మీటర్ల పొడవునా గోతులు కాలువ కింద తవ్వి అంగుళం వ్యాసం కల పీవీసీ పైప్‌లైన్ పనులు చేపట్టారు. విషయాన్ని కమిషనర్ రామారావు దృష్టికి తీసుకెళ్లగా పైప్‌లైన్ పనులకు ఏ అనుమతులు లేవని పరిశీలించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'ఆదిత్య'లో ముగిసిన వర్క్‌షాప్‌లు

గండేపల్లి, మార్చి 16: సూరంపాలెంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీలో డేటా ఎనాలటిక్స్ యూజింగ్ పైథాన్ అనే అంశంపై జరిగిన వర్క్‌షాప్ శనివారంతో ముగిసింది. ఏపీఎస్ఎస్‌డిసికి చెందిన టి.సుకన్య శిక్షణ ఇచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి, డీన్ రమశ్రీ, విభాగాధిపతి డాక్టర్ ఎం.వెంకటేష్ ఉన్నారు. ఈసీఈ విభాగం నందు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అనే వర్క్‌షాప్ ముగిసిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ బి.మహిధర్ విద్యార్థులకు పలుఅంశాలు వివరించారు.